మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

పేదరిక నిర్మూలనకు చర్యలు

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పేదరిక నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలనిజిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా కోరారు. శుక్రవారం కలెక్టరేట్లో పి 4 విధానం అమలుపై స్టేక్ హోల్డర్లతో, ఇండస్ట్రియల్ సోసియేషన్స్, ఛాంబర్ ఆఫ్ కామర్స్, ప్రముఖులు ప్రజాప్రతినిధులతో కలెక్టర్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర 2047 లో భాగంగా పేదరికం లేని సమాజంగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశ్యంతో పి4 కార్యక్రమాన్ని ఉగాది రోజు ప్రారంభించనున్నారని తెలిపారు. సమాజంలో ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్న 10 శాతం మంది అత్యంత పేదరికం లో ఉన్న 20 శాతం మందికి చేయూతనివ్వడం ఈ కార్యక్రమం లక్ష్యం అని పేర్కొన్నారు. వీరిని గుర్తించేందుకు గత నెల 25వ తేది నుండి మార్చి 25 వరకు సర్వే చేస్తున్నామన్నారు. ఈ సర్వేలో ప్రతి గ్రామంలో గ్రామ సభలు నిర్వహించి అత్యంత పేదరికంలో ఉన్న 20 శాతం మందిని గుర్తిస్తామన్నారు. జీరో పావర్టీ, ఉపాధి, మానవ వనరుల అభివృద్ధి, నైపుణ్యం,ప్రతి కుటుంబానికి నీరు ఇవ్వడం, రైతు-వ్యవసాయ సాంకేతికత, గ్లోబల్ బెస్ట్ లాజిస్టిక్స్, ఇంధనాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవడం, ప్రొడక్ట్ పర్ఫెక్షన్, స్వచ్ఛ ఆంధ్ర తదితర సూత్రాల అమలు ద్వారా పి4 విధానం అమలు అవుతోందన్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ పేద కుటుంబాలను బంగారు కుటుంబాలుగా మార్చేందుకు మార్గదర్శకులుగా ముందుకు రావాలన్నారు. పి4 విధానంలో భాగస్వాములై సహాయ సహకారాలు అందజేయాలన్నారు. ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ... జిల్లాలో పశ్చిమ ప్రాంతం పూర్తిగా వెనుకబడి ఉందన్నారు. ఈ ప్రాంతంలో పేదరిక నిర్మూలన కు అత్యున్నత వర్గాలు మార్గదర్శకులుగా ముందుకు వచ్చి తగిన సహకారం అందచేయాలన్నారు. పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యామ్ కుమార్ మాట్లాడుతూ... పేదరిక నిర్మూలనకు ముందుకు రావాలని, ఇందుకోసం తమ వంతు సహకారాన్ని కూడా అందచేస్తానన్నారు. సమావేశంలో పి 4 విధానం అమలుకు సంబంధించి పలువురు పరిశ్రమల ప్రతినిధులు తమ అభిప్రాయాలను తెలిపారు. టిడిపి జిల్లా అధ్యక్షుడు తిక్కా రెడ్డి, సిపిఒ హిమ ప్రభాకర్ రాజు, జిల్లా అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి నారాయణచార్యులుకు ఘనంగా నివాళి

పుట్టపర్తి నారాయణాచార్యుల జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాష శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ పుట్టపర్తిలో ఆయన పూర్వీకులు నివసించడం చేత పుట్టపర్తి ఆయన ఇంటి పేరు అయిందన్నారు. ఆయన చిన్నతనంలోనే రామాయణ, భాగవత, భారత ఇతిహాసాలను ఔపోసన పట్టార న్నారు. సంగీతం, సాహిత్యం, నాట్యంలో సుప్రసిద్ధులైన పుట్టపర్తి 14 భాషలలో పాండిత్యం సంపాదించి ఎన్నో నవలలు, నాటకాలు, కావ్యాలు రాసి సాహితీశిఖరంగా నిలిచారన్నారు. డిఆర్ఒ సి.వెంకట నారాయణమ్మ, జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి వెంకటేశ్వర్లు , సెట్కూరు సిఇఒ వేణుగోపాల్ పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న అధికారులు

విద్యుత్ భారాలను ఆపకపోతే మరో పోరాటం

• సెకీ ఒప్పంద అవినీతిలో ప్రభుత్వ భాగస్వామ్యం ఎంత • సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ట్రూ అప్ సర్దుబాటు పేరుతో వేస్తున్న భారాలను ఇక ఆపకపోతే మరో విద్యుత్ పోరాటాన్ని చూడాల్సి వస్తుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం ప్రజలపై వేస్తున్న ట్రూఆఫ్ చార్జీలను, సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లను నియంత్రించాలని కోరుతూ సిపిఎం కర్నూలు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యుత్ సౌధ ముందు ఆందోళన నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి. రాముడు అధ్యక్షతన జరిగిన ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె. ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి డి .గౌస్ దేశాయి మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం అనైతిక పరిపాలనను కొనసాగిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఆదానితో చేసుకున్న రూ.17 వేల కోట్ల సెకీ ఒప్పందపు అవినీతి బాగోతం బట్టబయలయిందన్నారు. ఆ అవినీతి ఒప్పందాన్ని రద్దు చేయకుండా కొనసాగిస్తుందంటే ఆ అవినీతిలో కూటమి ప్రభుత్వ భాగ స్వామ్యం ఎంత అని ప్రశ్నించారు. అధికారానికి రాకముందు చంద్రబాబుతో పాటు నారా లోకేష్, పయ్యావుల కేశవ్ లాంటి వాళ్ళు విద్యుత్ చార్జీల భారంపై వీరుల్లా మాట్లాడడమే కాక మరికొంత ముందుకెళ్లిన నారాలోకేష్ ఏకంగా రైతులకు విద్యుత్ మీటర్లను పగలగొట్టండని పిలుపు ఇచ్చారన్నారు. బూటకపు మాటలు కాదు ప్రజలకు విద్యుత్ భారాల నుండి తప్పించే బాధ్యత లేదా అని ప్రశ్నించారు. ప్రజలకు మాయ మాటలు చెప్పి పెడుతున్న స్మార్ట్ మీటర్ల వల్ల, కర్నూలు నగరంలోని విద్యుత్ సౌధ ముందు ఉన్న దుకాణ దారులను ఇప్పుడే కలిసి విచారిస్తే.. ఒక్కో దుకాణదారుడు కి స్మార్ట్ మీటర్ వల్ల రూ.500 నుండి రూ.1000 అదనంగా బిల్లు వస్తున్నట్లు చెప్పారన్నారు. ఈ అదనపు బిల్లులో అదాని స్మార్ట్ మీటర్ తయారీకైన రూ.పదివేలను ప్రతినెలా రూ.వంద చొప్పున వినియోగదారునితో ముక్కుపిండి లాగుతున్నారన్నారు. గతంలో విద్యుత్ బారాలపైన ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ప్రజలు ప్రాణాలు బలిదానం చేయడానికి సైతం వెనకాడకుండా పోరాడిన చరిత్ర చంద్రబాబుకు ఇంకా గుర్తుండే ఉంటుందన్నారు. ట్రూ ఆఫ్ సర్దుబాటు పేరుతో వేస్తున్న భారాలను ఇక ఆపకపోతే మరో విద్యుత్ పోరాటాన్ని చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ, ఎండి.ఆనంద్ బాబు, ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం.రాజశేఖర్ మాట్లాడారు. జిల్లా కమిటీ సభ్యులు అరుణ, గురు శేఖర్, విజయ్, న్యూ సిటీ కార్యదర్శి వర్గ సభ్యులు సాయిబాబా, సుధాకరప్ప, నరసింహులు, ప్రభాకర్, ఓల్డ్ సిటీ కార్యదర్శి వర్గ సభ్యులు అబ్దుల్ దేశాయ్, షరీఫ్, రామకృష్ణ, నాయకులు సుజాత, యేసు రాజు, చిన్నఆనంద్, దావీదు, చలపతి, మద్దిలేటి, గోపి, శీను, రియాజ్ తో పాటు మరో వంద మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ సౌధ ముందు ఆందోళననుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు ప్రభాకర్‌రెడ్డి

బీరువా అంటే భద్రత

- తయారీ దారులకు తగ్గిన ఆదాయం
- తను బతుకుతూ మరికొందరికి ఉపాధి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

బీరువా (అల్మారా)అనేది ప్రతి ఇంట్లోనూ ముఖ్యమైన ఫర్నిచర్. ఇది మన విలువైన వస్తువులను, డబ్బును, ఆభరణాలను , ఇతర ముఖ్యమైన డాక్యుమెంట్లను భద్రపరచడానికి ఉపయోగపడుతుంది. బీరువా మన వస్తువులను చక్కగా అమర్చడానికి సహాయపడుతుంది. ఇది మన ఇంటిని శుభ్రంగా , క్రమబద్ధంగా ఉంచడానికి ఉపయోగపడుతుంది. బీరువా మనకు అవసరమైన వస్తువులను సులభంగా అందుబాటులో ఉంచుతుంది. ఇది మన జీవితాన్ని మరింత సౌకర్యవంతంగా చేస్తుంది.

వివిధ రకాలు: ఇనుప బీరువాలు, చెక్క బీరువాలు, , వాల్ బీరువాలు వంటివి అందుబాటులో ఉన్నాయి. బీరువా మన ఇంటికి ఒక ముఖ్యమైన ఫర్నిచర్. దీని తయారీ దారులకు లాభాలు తెచ్చిపెట్టడంతో పాటు కొందరికి ఉపాధి లభించేది. నేడు ఆ బీరువాల తయారీ కేంద్రాల యజమానులు గిరాకీలు లేక ఇటు కార్ఖానా యజమానులు అటు తయారీదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై ప్రజాశక్తి ప్రత్యేక కథనం...

నాయబ్ స్టీల్ ఫర్నిచర్ వర్క్స్ ప్రొప్రైటర్ ఎం.అక్రమబాష తెలిపిన వివరాల ప్రకారం...ఆయన మాటల్లో ... బీరువాలు తయారీ ఫ్యాక్టరీని ఏర్పాటు చేసి కార్మికులకు పని కల్పిస్తున్నాం. బీరువాలకు కావలసినటువంటి ఐరన్ రేకులు హైదరాబాద్ నుండి టన్ను రూ.ఆరువేలు, రవాణా ఖర్చులు రూ.2000 కలిపి ఎనిమిది వేలకు తెప్పించుకుంటాం. బీరువాలు 18 నుండి 2గేజ్ వరకు మందం గల రేకులతో తయారు చేస్తుంటాం. నాలుగున్నర అడుగుల బీరువా రూ.4000, ఐదున్నర అడుగుల బీరువా రూ.4500, ఆరున్నర అడుగుల బీరువా రూ.5000, చొప్పున తయారుచేసి అమ్ముతుంటాం. మందం ఎక్కువగా ఉన్న రేకుతో తయారుచేసిన బీరువాలు రూ.9వేల నుండి రూ.20వేల వరకు కూడా తయారు చేస్తాం. తన దగ్గర 16 మంది పనిచేస్తున్నారు. ఒక్కొక్కరికి వారి పనితనాన్ని బట్టి రోజుకు రూ.ఐదు వందల నుండి రూ.1200 వరకు ఇస్తూ ఉంటాను. వారం వారం వారు పరిచేసిన దానికి లెక్క కట్టి ఇస్తుంటాను. తన దగ్గర పనిచేసే కార్మికులకు ఇబ్బందుల్లో ఉంటే ఆదుకునేందుకు అడ్వాన్స్ గా కూడా డబ్బులు ఇస్తూ ఉంటాను. తన దగ్గర తయారైన బీరువాలు ఎమ్మిగనూరు, ఆత్మకూరు ,కోడుమూరు, రాజోలి, నందికొట్కూరు పట్టణాలకు హోల్‌సేల్ రేట్లతో పంపుతుంటాను. ఎవరైనా నేరుగా వచ్చి బీరువా కావాలంటే కస్టమర్ మళ్ళీ రావాలని ఉద్దేశంతో బీరువాపై రూ.1000, రూ.500 ఆదాయం వచ్చినా కూడా అమ్ముంటాను. ప్రస్తుతం అధునాతన పద్ధతుల ద్వారా ఇంటి నిర్మాణాలు చేస్తున్న సందర్భాల్లో గోడల్లోనే కబోర్డులు పెట్టడం వల్ల బీరువాలపై ప్రజలు ఎక్కువగా ఇష్టపడడం లేదు. ధరలు తగ్గిపోయాయి ఎక్కువగా నగలు, నగదు ఉన్నవాళ్లు బ్యాంకుల్లో లాకర్లలో ఉంచుకోవడం జరుగుతుంది. గతంలో లాగా దొంగతనాలు దోపిడీలు జరగడం తగ్గిపోయాయి. పల్లెల్లో నివసించే చిన్న రైతులు, ముస్లింలు మాత్రమే బీరువాలను కొంటున్నారు.

అందరికీ ఈ-శ్రమ్ కార్డులు ఇవ్వాలి

- షేక్షావలి, ఖల్ల వీధి

మాలాంటి కార్మికులకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈశ్రమ్ కార్డులు ఇచ్చే సంక్షేమ పథకాలు అందేలా చూడాలి. తాను కల్లాలో బీరువాలు తయారీ పని నేర్చుకున్న. మొదట్లో నెలలు రూ.4000 వచ్చేవి. ప్రస్తుతం తెలుగు రూ.24000 సంపాదిస్తున్న. ముగ్గురు పిల్లలు ఉన్నారు. నా యజమాని మంచిగా చూసుకుంటున్నాడు. డబ్బులకు కొదవలేదు.

ప్రతి రంజాన్‌కు బట్టలు కుట్టిస్తారు

- షేక్ .హుస్సేన్ కర్నూలు

మా యజమాని ప్రతి సంవత్సరం ఇక్కడ పనిచేసే వారందరికీ రంజాన్ పండుగ సందర్భంగా బట్టలు కుట్టిస్తారు. ఇంటి పరిస్థితుల బట్టి తాను ఎనిమిదవ తరగతి వరకు మాత్రమే చదువుకున్న తర్వాత బీరువాలో తయారీ కార్ఖానాలో పనిచేయడానికి చేరా. తాను 11 సంవత్సరాలుగా పనిచేస్తున్న. తాను బీరువాలు తయారీలో ప్రావీణ్యత సంపాదించా. పూర్తి బీరువా తయారు చేస్తా.

రోజుకు రూ800 సంపాదిస్తున్నాం

- కరీం, అల్తాఫ్, కడక్‌పుర

ఇద్దరం అన్నదమ్ములం బీరువా తయారీ అయిన తర్వాత లప్పం కనిపించి పెయింట్ వేసే పని చేస్తుంటాం. బీరువాకు ఐదున్నర అడుగులకు రూ.200 రూపాయలు, ఆరున్నర అడుగుల బీరువాకు రూ.250 రూపాయలు చొప్పున యజమానిఇస్తాడు. అలా రోజుకు రూ.800 చొప్పున సంపాదిస్తున్నాం. మా యజమాని మంచిగా చూసుకుంటాడు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా ఆదుకుంటాడు.

మంచి మనసున్న మనిషి

షేక్ ఖాజా భాష టీవీ9 ప్రజా నగర్ కాలనీ,

మా యజమాని మంచి మనసున్న మంచి, తాను మొట్టమొదటిగా గడ్డ దగ్గర బీరువాళ్ళ తయారీ దగ్గర నేర్చుకున్న, ఇక్కడ ఏడు సంవత్సరాలుగా పనిచేస్తున్న. బీరువాల రేకులను కటింగ్ చేయడం మోడలింగ్ చేయడం లాంటి పనులను చేస్తూ ఉంటా. తనకు ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. ఒక బీరువాకు రూ.500 ఇస్తారు. ఎంత కష్టపడితే అంత ఆదాయం వస్తుంది. కష్టానికి తగ్గ ఫలితం దక్కుతుంది. అందుకే ఇక్కడ నుండి వేరే చోట ఎక్కడికి పని చేయడానికి వెళ్ళను.

మా అడ్రస్.
ఎం .అక్రమబాష ప్రొప్రైటర్,
నాయబ్ స్టీల్ ఫర్నిచర్ వర్క్స్, పాత ఈద్గా కొత్త బస్టాండ్ రోడ్ కర్నూలు.
సెల్ నంబర్లు: 8106525400, 9440576438.

కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

ఎమ్మెల్యే అఖిల ప్రియ పై చర్యలు తీసుకోవాలి

ఎపిడబ్ల్యుఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట ఎదుట నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సాక్షి కార్యాలయం పై దాడి చేసిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పై చర్యలు తీసుకోవాలని ఎపిడబ్ల్యుజెఎఫ్ నేతలు బి.గోరంట్లప్ప, కెబి శ్రీనివాసులు, నాగేంద్రలు డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట గాంధీ విగ్రహం సమీపంలో ఎపిడబ్ల్యుఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. నగర అధ్యక్షుడు శివ శంకర్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో ఎపిడబ్ల్యుఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.గోరంట్లప్ప, కెబి. శ్రీనివాసులు జిల్లా కన్వీనర్ కె.నాగేంద్ర, మాట్లాడుతూ వాస్తవాలు రాసిన జర్నలిస్ట్ లపై దాడులు చేయడం ఆయా కార్యాలయాలపై దాడులకు పాల్పడటం దుర్మార్గమన్నారు. ఇలాంటి దాడులు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ధరణి కిషోర్, హుస్సేన్, ఫొటో గ్రాఫర్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు డి.హుస్సేన్, సుబ్రహ్మణ్యం, సీనియర్ జర్నలిస్టులు సత్యనారాయణ గుప్తా, రవివర్మ, లోకేష్ లు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎఒకు వినతిపత్రం అందజేస్తున్న ఎజెఎఫ్ నాయకులు

మన న్యూస్ రిపోర్టర్ పై కేసు ఎత్తివేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

తెలంగాణ రాష్ట్రం,మన తెలుగు దినపత్రిక ప్రతినిధి గంగన్నపై అక్రమంగా పెట్టిన కేసును ఎత్తివేయాలని యుజెఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం యునైటెడ్ జర్నలిస్ట్ ఫోరం (యుజెఎఫ్) వ్యవస్థపాక అధ్యక్ష,కార్యదర్శులు చిన్న రామాంజనేయులు,నీలం సత్యనారాయణ జిల్లా కమిటీ అధ్యక్ష,కార్యదర్శులు దండు విద్యాసాగర్,డి..చంద్రమోహన్ లు కలెక్టరేట్ ఎఒకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ తెలంగాణలో 10వ తరగతి గణిత శాస్త్రం ప్రశ్నాపత్రం లీక్ కావడంతో సంబంధిత వార్తను మన తెలుగు దినపత్రిక లో ప్రచురించడంతో కేసు కట్టి అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. గంగన్నపై పెట్టిన అక్రమకేసును ఎత్తివేసి,తక్షణమే విడుదల చేయాలని కోరారు. ఇటీవల ప్రతి చిన్న విషయానికి పత్రికా స్వేచ్చను హరించేలా వ్యవహరిస్తున్న తీరును వారు ఖండించారు. ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు విజయ్ కుమార్,ప్రింట్ మీడియా జిల్లా కమిటీ సభ్యులు పరమేష్,విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బాబాబృందావన్ నగర్‌ను వెంటాడుతున్న తాగునీటి సమస్య

25 యేళ్లుగా లేనిది ఇప్పుడు ఎందుకు ఏర్పడింది
పిపిఎస్ఎస్ నాయకుల ముందు ప్రజల మొర

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నాల్గవ పోలీస్ స్టేషన్ సమీపం లో ఉన్న బాబాబృందావన్ నగర్ లో ఎన్నడూ కని విని ఎరగని రీతిలో తాగునీటి సమస్య ఏర్పడింది. రోజు డబ్బులు పెట్టి నీళ్లు కొంటున్నారు. నీళ్లు కొనలేని కొందరు మహిళలు వంట రూములో కంటనీరు పెడుతున్నారని కాలనీ ప్రతినిధులు జి. రామకృష్ణారెడ్డి, ఎ.పరమేశ్వరయ్య, టి. నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి సమస్యతో బాబాబృందావన్ నగర్ ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఈరోజు ఉదయం కాలనీలో పర్యటించిన పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం దృష్టికి తెచ్చారు. నాయకులు మాట్లాడుతూ 25 ఏళ్ల నుండి ఎప్పుడూ నీళ్ల సమస్య రాలేదని, గత రెండేళ్లుగా రోజురోజుకు తాగునీటి సరఫరా తగ్గిపోయిందన్నారు. గతంలో రోజు తాగు నీరు వచ్చేవని..గత రెండేళ్లుగా రెండు రోజులకు ఒకసారి వదులుతున్నారని తెలిపారు. అవి కూడా ఎప్పుడు వదులుతారో ఎంతసేపు వదులుతారో తెలియని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. సిమెంటు రోడ్లన్నీ తవ్వి వాహనాలు ఇంటికి చేరే పరిస్థితి లేకుండా చేశారని విమర్శించారు. పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి మాట్లాడుతూ ఈ కాలనీలో నివసించే ఉద్యోగులు వ్యాపారులు కలిసి 25 ఏళ్ల క్రితం సొంత ఖర్చులతో పైపులైన్లు వేయించుకున్నారన్నారు. గత 25 ఏళ్ల నుండి రాని తాగునీటి సమస్య ఇప్పుడే ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. కొందరు నీళ్లు కొనలేక బోరింగులపై ఆధారపడ్డారన్నారు. జిల్లా కేంద్రంలోనే పరిస్థితి ఇలా ఉండడం బాధాకరమన్నారు. నగరంలో నీళ్ల ట్యాంకులు, నీటి శుద్ధి కేంద్రాలు ఏమయ్యాయి..శుద్ధి చేసిన తాగునీరు ఎక్కడ పోతున్నాయని ప్రశ్నించారు. తాగునీటి సరఫరాలో వివక్షత చూపుతున్నారని విమర్శించారు. కలెక్టర్‌తో పాటు అవసరమైతే రాష్ట్ర మంత్రి టిజి భరత్ కూడా జోక్యం చేసుకోని తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ పర్యటనలో కాలనీ ప్రతినిధులు సి జనార్ధన్ రెడ్డి, బి రామ్ గోపాల్ రెడ్డి, డి రంగనాయకులు, పి.పాల్గుణరెడ్డి, , పి పి ఎస్ ఎస్ నగర నాయకులు సివి వర్మ, ఎండి యూనిస్, ఎస్.అన్వర్‌బాష, బి.ప్రభాకర్ రెడ్డి, ఎ.విశ్వనాథ్ జెచౌదరి, ఎ.వెంకటేశ్వర్లు, జి. నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బోరుబావినుంచి నీటిని తీసుకుపోతున్న బాబాబృందావన్ నగర్ వాసులు

జమ్ కేర్ కామినేనిలో క్లిష్టమైన భుజం మార్పిడి ఆపరేషన్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : కర్నూలు నగరంలోని జమ్ కేర్ కామినేని హాస్పిటల్లో క్లిష్టమైన భుజం మార్పిడి ఆపరేషన్ విజయవంతంగా చేశామని ప్రముఖ ఆర్థోపెడిక్ డాక్టర్ రవిబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.... నంద్యాల జిల్లా గాజులపల్లికి చెందిన జయమ్మ గత సంవత్సరం జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్‌లో మోకాలు మార్పిడి చేశామని, ఆమెకు 6 నెలల నుండి కీళ్ల నొప్పులు అధికమై చెయ్యి కూడా పైకి ఎత్తలేని పరిస్థితుల్లో హాస్పిటల్ లో చేరింది. ఆమెకు ఎమ్మార్ఐ, ఎక్స్ రే అన్ని రకాల టెస్టులు చేసిన అనంతరం కుడిభుజం ఎముకలు పూర్తిగా అరిగి పోయినట్లు నిర్ధారణ అయింది. ఈ వ్యాధిని ఆంకలోసిస్ అంటారు. దీనికి ఉత్తమ చికిత్స భుజం మార్పిడి చేయడమే. భుజం మార్పిడి ఆపరేషన్ చాలా క్లిష్టమైనది. ఈ ఆపరేషన్ ప్రముఖ నగరాలైన హైదరాబాదు, బెంగళూరు తదితర ప్రాంతాల్లో మాత్రమే చేస్తున్నారు. ఇప్పుడు కర్నూలు జమ్ కేర్ కామినేని హాస్పిటల్‌లో చేశాం. భుజం మార్పిడిలో కాంప్లెక్స్ ప్రొసీజర్ రివర్స్ షోల్డర్ ఆర్థోప్లాస్టి చేశారు. దీనివల్ల రోగికి భుజం కదలిక పూర్తిగా వచ్చింది. ప్రస్తుతం పేషంటు ఫిజియోథెరపీ చికిత్సతో కోలుకుంటున్నారు. ఈ ఆపరేషన్‌లో మత్తు డాక్టర్లు ఆదిత్య, మాధవి తదితర బృందం పాల్గొన్నారు. ఎటువంటి కీళ్ళు, ఎముకలు వ్యాధులకైనా జెమ్ కేర్ హాస్పిటల్‌లో అత్యుత్తమ చికిత్సలు, ఆపరేషన్‌లు చేస్తున్నాం. జమ్ కేర్ కామినేని హాస్పిటల్‌లో క్లిష్టమైన భుజం మార్పిడి ఆపరేషన్ విజయవంతం చేసినందుకు డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ బాలమురళీకృష్ణ, డాక్టర్ రామమోహన్ రెడ్డి, డాక్టర్ రాఘవేంద్ర, డాక్టర్ ఆదిత్య, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ గణేష్, నదీమ్, కృష్ణవేణి, ఆపరేషన్ చేసిన డాక్టర్ రవిబాబుకు, సిబ్బందికి అభినందనలు తెలిపారు.

డాక్టర్ రవిబాబు గురించి: డాక్టర్ రవిబాబు ఎంబిబిఎస్, ఎంఎస్ కర్నూలు నగరంలోని మెడికల్ కాలేజీలో చదివారు. ఫెలోషిప్, స్పోర్ట్స్ ఇంజురీస్, ఆర్థ్రోప్లాస్టి బెంగళూరు, కేరళలో పూర్తి చేశారు. అబ్జర్వర్‌షిప్ జర్మనీ, సింగపూర్‌లో చేశారు. ఇప్పుడు కర్నూలు నగరంలోని జెమ్ కేర్ కామినేని హాస్పిటల్లో అత్యుత్తమ సేవలందిస్తున్నారు.

పెంచిన కరెంటు చార్జీలు తగ్గించాలి: సిపిఎం

ప్రజాశక్తి-పత్తికొండ : కూటమి ప్రభుత్వం సెకీతో ఒప్పందాన్ని రద్దు చేయాలని, ట్రూ అప్ చార్జీలను తగ్గించాలని సిపిఎం మండల కార్యదర్శి చక్రాల వెంకటేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం పత్తికొండ పట్టణంలోని సిపిఎం ఆధ్వర్యంలో ఈశ్వర్ రెడ్డి భవన్ నుండి సిపిఎం నాయకులు, కార్యకర్తలు, పెంచిన కరెంట్ చార్జీలను తగ్గించాలంటూ నినాదాలతో విద్యుత్ శాఖ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి విద్యుత్ అధికారికి సమస్యలతో కూడిన పత్రాన్ని అందజేశారు. నాయకుడులు సిద్దయ్య అధ్యక్షతన జరిగిన ధర్నానుద్దేశించి చక్రాల వెంకటేశ్వర్ రెడ్డి, రంగారెడ్డి ,దస్తగిరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు కరెంటు చార్జీలు పెంచబోమని చెప్పి అధికారంలోకి వచ్చిన 10 నెలల కాలంలో మూడు సార్లు కరెంటు చార్జీలు పెంచిందన్నారు. పెంచిన కరెంటు చార్జీలు తగ్గించి ట్రూ అప్ చార్జీలు రద్దుచేయాలని, స్మార్ట్ మీటర్లు బిగించే విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ అధికారికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రజలనుంచి వినతులు స్వీకరిస్తున్న మంత్రి టిజి.భరత్, కలెక్టర్

'మీ సమస్య - మా పరిష్కారం' కు సమస్యల వెల్లువ

వినతలు స్వీకరించిన మంత్రి టీజీ భరత్

ప్రజాశక్తి కర్నూలు క్రైమ్

కర్నూలు మౌర్య హోటల్ లోని శ్రీ ఆర్య ఫంక్షన్ హాల్ లో కర్నూలు నియోజకవర్గం లోని ప్రజల నుంచి పరిశ్రమల శాఖ మంత్రి టిజి.భరత్, జిల్లా కలెక్టర్ పి రంజిత్‌బాష 'మీ సమస్య – మా పరిష్కారం' పేరుతో వినతులను స్వీరించారు. పలుసమస్యలపై వినతులు వెల్లువలా వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భారీ ఎత్తున ప్రజలు తరలివచ్చారు. ప్రజల నుంచి ఆయన వినతులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

స్కానింగ్ కేంద్రాల ఆకస్మిక తనిఖీ

రిజిస్ట్రేషన్,రెన్యువల్ ధ్రువపత్రాల పరిశీలన

ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్ : జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఆదేశాలమేరకు శుక్రవారం జిల్లా సంచార చికిత్స కార్యక్రమ నోడల్ అధికారి డాక్టర్ రఘు కర్నూలు నగరంలోని లోటస్, సన్‌రైస్ అల్ట్రాసౌండ్ స్కానింగ్ కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేసి రిజిస్ట్రేషన్, రెన్యువల్‌కు సంబంధించిన ధ్రువపత్రాలను , రేఫెరల్ స్లిప్స్‌ను పరిశీలించారు. స్కానింగ్ సెంటర్లలో మిషన్లు రిజిస్టర్ లో నమోదు వాటి వరుస సంఖ్య తయారీ కంపెనీల పేర్లను సరిపోల్చి చూశారు. స్కానింగ్ సెంటర్ల తనిఖీలో భాగంగా లింగ నిర్ధారణ చట్ట రీత్యా నేరమని తెలిపారు. స్కానింగ్ చేసే ప్రతి గర్భిణీ వివరాలను ఫారం ఎఫ్‌లో ఇంటి పేరుతో రాయాలని మొదటి కాన్పు, రెండవ కాన్పు ఆడ, మగ , వయస్సు, రాయాలని అన్నారు. ఫారం ఎఫ్ లు ప్రతి నెల 5 వ తేదీ లోపు ఆన్ లైన్ లో పొందుపరచాలని తెలిపారు. స్కానింగ్ నివేదికలను రెండేళ్ల వరకు భద్రపరచుకోవాలని తెలిపారు. స్కానింగ్ కేంద్రాల్లో పనిచేసే సహాయ సిబ్బంది విద్యార్హతలు పరిశీలించారు. పిసిపిఎన్‌డిటి యాక్ట్ కింద తప్పని సరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, ఇప్పటికే రిజిస్ట్రేషన్లు చేయించుకున్నవారు కాలపరిమితి లోపల రెన్యూవల్ చేయించాలని తెలిపారు.

రిజిస్ట్రేషన్,రెన్యువల్ ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ

విద్యుత్ చార్జీలపై మాట తప్పిన చంద్రబాబు

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని విద్యుత్ భవన్ ముందు నిరసన తెలుపుతున్న నాయకులు

విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పిన ముఖ్యమంత్రి చంద్ర బాబు మాట తప్పారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు ఈరన్న విమర్శించారు. సెకీ ఒప్పందాలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు ఉపసంహరించుకోవాలని, ట్రూ అప్ చార్జీల భారాన్ని తొలగించాలని శుక్రవారం ఆదోని విద్యుత్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని ఎన్నికలకు ముందు కూటమి నాయకులు హామీఇచ్చారని, అధికారంలోకి వచ్చాక మాట తప్పి ప్రజలపై భారం మోపుతున్నారని మండిపడ్డారు. విద్యుత్ చార్జీలను తగ్గించి, చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పట్టణ, మండల కార్యదర్శులు లక్ష్మన్న, లింగన్న, నాయకులు పి.ఎస్.గోపాల్, తిప్పన్న, రామాంజనేయులు, వీరేష్, అయ్యప్ప, శ్రీనివాసులు, నాగరాజు, సతీష్ ఉన్నారు. **ఆదోని (రూరల్)** మండలంలోని విద్యుత్ ఎఇకి వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశ్వర్లు, రైతుసంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు శేఖర్, అయ్యప్ప పాల్గొన్నారు. **కౌతాళం** సబ్ స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టి, ఎఇ నరసన్నకు వినతిపత్రం అందజేశారు. సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య, మండల నాయకులు హనుమంతు, టి.వీరేష్, నారాయణ, ఎంకప్ప, వీరన్న పాల్గొన్నారు. **హాలహర్వి** ఎఇ కార్యాలయంలో ఎఇ జబ్బన్నకు వినతి పత్రం అందజేశారు. సిపిఎం మండల కార్యదర్శి కృష్ణ, సిఐటియు నాయకులు దగ్గప్ప, రామాంజిని, శేషప్ప, నాగరాజు, వీరేష్ పాల్గొన్నారు. **ఆలూరు** విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం సబ్ డివిజన్ డిఇఇ సంతోష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సిపిఎం సీనియర్ నాయకులు కెపి.నారాయణస్వామి, షాకీర్, వీరేష్, రత్నమ్మ, శేఖర్, మైనా, గోసేయి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

- ఎంపిడిఒ కార్యాలయం ఎదుట సిపిఎం బైఠాయింపు

ప్రజాశక్తి - దేవనకొండ



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయం ఎదుట బైఠాయించారు. సిపిఎం నాయకులు శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.వీరశేఖర్, మండల కమిటీ సభ్యులు అశోక్, సూరి మాట్లాడారు. మండలంలోని బండగట్టు, వెంకటాపురం, మాదాపురం, బుర్ర కుంట, తెర్నేకల్ గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. సమస్యపై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని విమర్శించారు. సమస్య పరిష్కారంపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ఆయా సచివాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. సిపిఎం నాయకులు కెపి.రాముడు, నాగేష్, అస్లాం బాష, పాండు, నాగేంద్ర, హుస్సేన్ పీరా, బలరాముడు, కౌలుట్ల, గిడ్డయ్య పాల్గొన్నారు.

పంటలు ఎండకుండా చూడండి

- ఏప్రిల్ 20 వరకు సాగునీరివ్వాలి

- ఎల్ఎల్‌సి ప్రాజెక్టు చైర్మన్ సుల్తాన్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్ నాయుడు, ఎల్ఎల్‌సి నీటి వాటా పరిరక్షణ కమిటీ సభ్యులు సాయిబాబు

ప్రజాశక్తి - ఆదోని

ఆయకట్టు కింద రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలు ఎండిపోకుండా ఏప్రిల్ 20 వరకు ఎల్ఎల్‌సికి నీరు ఇవ్వాలని ఎల్ఎల్‌సి ప్రాజెక్టు చైర్మన్ టిప్పు సుల్తాన్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్ నాయుడు, ఎల్ఎల్‌సి నీటి వాటా పరిరక్షణ కమిటీ సభ్యులు సాయిబాబు కోరారు. శుక్రవారం ఆదోని టిబిపి, ఎల్ఎల్‌సి కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పాండురంగయ్యకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జిల్లా పశ్చిమ ప్రాంతంలో ఉన్న ఎల్ఎల్‌సి నీటి ద్వారా కౌతాళం మండలంలోని పలు గ్రామాల్లో రబీ సీజన్‌లో జొన్న, సజ్జ, వేరుశనగ, మిరప వంటి పంటలు సాగు చేశారని తెలిపారు. ప్రస్తుతం పంటలు కాపు దశలో ఉన్నాయని, ఏప్రిల్ 20 వరకు నీరిస్తే పంట చేతికందుతుందని, రైతులు నష్టపోకుండా ఉంటారని చెప్పారు. తాగునీటి కోసం నీటిని సరఫరా చేయాలని కోరారు. ఈ విన్నపాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పంటలు ఎండిపోకుండా చూస్తామని ఇఇ పాండురంగయ్య తెలిపారు. నాయకులు అడివప్ప, వెంకట చలపతి రాజు, సిద్దప్ప, రైతులు ఉన్నారు.

ఇఇ పాండు రంగయ్యకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సాగునీటి సమస్యను పరిష్కరించండి

- గుండ్లకొండ దగ్గర స్లూయిజ్ నిర్మించాలి

- సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వీరశేఖర్

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని విస్తారంగా సాగునీటి అవకాశాలున్నా పాలకుల నిర్లక్ష్యంతో రైతులకు సాగునీరు సకాలంలో, సక్రమంగా అందడం లేదని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.వీరశేఖర్ విమర్శించారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సిపిఎం మండల కమిటీ సభ్యులు ఎం.అశోక్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాలకుల నిర్లక్ష్యం, ప్రకృతి నిరాదరణతో మండల ప్రజలకు, రైతులకు కన్నీళ్లే దిక్కయ్యాయని, పాలకులు కళ్లు తెరిచి మండలంలోని 20 వేల ఎకరాలకు సాగునీరివ్వాలని డిమాండ్ చేశారు. గుండ్లకొండ దగ్గర స్లూయిజ్ ఏర్పాటు చేసి కోటకొండ వరకు కాలువను తీసుకురావడం ద్వారా మండలంలోని సుమారు 10 వేల ఎకరాలకు సాగునీరు, చెరువులకు నీళ్లు మళ్లించవచ్చని పేర్కొన్నారు. మండలంలోని 47 వేల ఎకరాలకు సాగునీరు రావాల్సి ఉండగా ఇప్పటివరకు అరకొరగా హంద్రీనీవా ప్రధాన కాలువ నుంచి మోటార్లు, డీజిల్ ఇంజిన్ల ద్వారా సాగునీటిని రైతులు వాడుకుంటున్నారని తెలిపారు. కాలువకు కప్పట్రాళ్ల, పాలకుర్తి, తెర్నేకల్, కరివేముల గ్రామాల మధ్య పెండింగ్ పనులు ఉంటున్నాయని, వాటిని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. మండల సర్వసభ్య సమావేశంలోనూ మండల ప్రజాప్రతినిధులు పేర్కొన్నారని తెలిపారు. సాగునీటి అవసరాలపైనా, రెవెన్యూ సమస్యలపైనా అధికారులు స్పందించకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. సిపిఎం మండల కమిటీ సభ్యులు సూరి, ఆయా గ్రామాల నాయకులు కెపి.రాముడు, నాగేష్, పాండు, నాగేంద్ర, బలరాముడు, శేఖర్, అస్లాం బాష, గిడ్డయ్య, కౌలుట్ల, పీరా, శ్రీనివాసులు, వీరప్ప, సుధాకర్, రవీంద్ర, లోకయ్య, శాంతిరాజు, నాగేంద్ర, ఐసా, బండ్లయ్య, రాముడు పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** పట్టణ సమస్యలను పరిష్కరించాలని సిపిఎం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి పి.గోవిందు, పట్టణ కమిటీ నాయకులు రాముడు, లక్ష్మీనారాయణ, సురేష్, కృష్ణ, రమేష్ మాట్లాడారు. ఎన్‌టిఆర్ కాలనీ టిడ్కో గృహాలు, జగనన్న కాలనీ, మస్తాన్ వైనార్జీ కాలనీల్లో ఇళ్లు పూర్తయినా అర్హులకు అప్పజెప్పడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. కాలనీల్లో తాగునీరు, విద్యుత్, రోడ్లు, డ్రైనేజీ, మౌలిక వసతులు కల్పించాలని కోరారు. పట్టణం తాగునీటి కోసం రెండో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును నిర్మించాలని డిమాండ్ చేశారు. ఎమ్మిగనూరులో ప్రభుత్వాసుపత్రిలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణం ప్రారంభానికి నోచుకోలేదని వాపోయారు. సాధ్యమైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తామని మున్సిపల్ కమిషనర్ హామీ ఇచ్చారు. సిపిఎం నాయకులు అబ్బుల్లా, కాలప్ప, కరే కృష్ణ, పులి రాజు, గుంటప్ప, లక్ష్మీదేవి, శివమ్మ, సరోజమ్మ, తిమ్మప్ప, వెంకటేష్ శెట్టి, శంకరన్న, బజారి, సుభాన్, పరమేష్ పాల్గొన్నారు.

దేవనకొండలో వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

ఎమ్మిగనూరులో వినతిపత్రం అందిస్తున్న నాయకులు

రీ సర్వే పైలట్ ప్రాజెక్టుగా ముగతి : సబ్ కలెక్టర్

ప్రజాశక్తి - నందవరం

నందవరం మండలం ముగతి గ్రామం రీసర్వే పైలట్ ప్రాజెక్టుగా 2వ విభాగంలో ఎంపికైనట్లు సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. శుక్రవారం గ్రామంలో రీసర్వేకు సంబంధించి ర్యాలీ నిర్వహించి, గ్రామస్తులకు రీసర్వేపై అవగాహన కల్పించారు. తహశీల్దార్ శ్రీనివాసులు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ శ్రీనివాస రాజు, రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ మహేష్ పాల్గొన్నారు.

కౌన్సిలర్లకు నోటీసులు

ప్రజాశక్తి - ఆదోని

మున్సిపల్ చైర్మన్ శాంతపై పెట్టిన అవిశ్వాసానికి సంబంధించి కలెక్టర్ రంజిత్ బాషా ఉత్తర్వుల మేరకు నోటీసులు జారీ చేశామని మున్సిపల్ కమిషనర్ కృష్ణ శుక్రవారం తెలిపారు. ఏప్రిల్ 16న అవిశ్వాస తీర్మానం బలపరీక్షకు కౌన్సిలర్లు హాజరుకావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కౌన్సిలర్లందరికీ నోటీసులు అందజేస్తామని తెలిపారు.

ఎస్సీ సెల్ సంయుక్త కార్యదర్శిగా మహానంది

- మాల మహానాడు నాయకుల హర్షం

ప్రజాశక్తి - ఆస్పరి

వైసిపి రాష్ట్ర ఎస్సీ సెల్ సంయుక్త కార్యదర్శిగా గుడిసె మహానంది ఎన్నిక పట్ల మాల మహానాడు తాలూకా నాయకులు వీరేష్, భరత్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆస్పరిలోని శుద్ధ బావి ప్రాంతంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వైసిపి ఎస్సీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా గుడిసె మహానందిని నియమించినందుకు వైసిపి అధినేత వైఎస్.జగన్మోహన్ రెడ్డికి, ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షికి, వైసిపి జిల్లా అధ్యక్షులు ఎస్వీ.మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో దళితులపై దాడులను అరికట్టాలని కోరారు. మాల మహానాడు నాయకులు హరి, రాజు, తిప్పన్న, రంగన్న, అమరేష్, రంగనాయకులు, సురేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

వైసిపి విప్ జారీకి రంగం సిద్ధం..!

- నేడు జరిగే కౌన్సిల్‌కు వైసిపి కౌన్సిలర్లు డుమ్మా..?

- 9వ రోజుకు చేరిన చైర్మన్ దీక్ష

ఫొటో దీక్షకు కూర్చున్న మున్సిపల్ చైర్మన్ శాంత

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని మున్సిపాలిటీలో రోజురోజుకు రాజకీయం మలుపు తిరుగుతోంది. ఛైర్మన్ శాంతపై అవిశ్వాస ప్రక్రియ దగ్గర్లోనే ఉందని వైసిపి కౌన్సిలర్లు అంటున్నారు. శనివారం మున్సిపల్ ఛైర్మన్ శాంత అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి వైసిపి కౌన్సిలర్లు 34 మంది గైర్హాజరయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే వైసిపి కౌన్సిలర్లందరికీ విప్ జారీ చేయాలని నిర్ణయించినట్లు కూడా తెలిసింది. కౌన్సిల్‌కు హాజరైనా నామమాత్రంగా కొన్ని తీర్మానాలు చేసి ఛైర్మన్‌కు వ్యతిరేకంగా బాయికాట్ చేయనున్నట్లు సమాచారం. 'న్యాయం చెప్పన్నా' అంటూ మున్సిపల్ ఛైర్మన్ శాంత చేపట్టిన నిరసన శుక్రవారంతో 9వ రోజుకు చేరింది. వైసిపి కండువా ధరించి ఛైర్మన్ దీక్షకు కూర్చుంటూనే విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసం అంటూ వైసిపి కౌన్సిలర్లు ప్రశ్నిస్తున్నారు. లోలోపల బిజెపి నాయకులతో సంబంధాలు నడుపుతూనే ఛైర్మన్ భర్త సింహం నాగేంద్ర ఛైర్మన్ శాంతతో దీక్ష చేయించడంతో ప్రజలు నవ్వుకుంటున్నారని వైసిపి కౌన్సిలర్లు పేర్కొంటున్నారు. ఇటీవలనే వైస్ ఛైర్మన్ నరసింహులు నాయకత్వంలో ప్రత్యేకంగా వైసిపి కౌన్సిలర్లు సమావేశమై అవిశ్వాస తీర్మానంపై తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై చర్చించినట్లు సమాచారం. ఇప్పటికే అవిశ్వాస తీర్మానంపై కలెక్టర్ రంజిత్ బాషా ప్రత్యేకంగా నోటీసులు తయారు చేసి కౌన్సిలర్ల వారీగా విచారణ కోసం జెసి, ఆదోని సబ్ కలెక్టర్ లేదా డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారులను నియమించి త్వరలోనే విచారణ చేపడతారని సమాచారం. ఇప్పటికే ప్రతి ఒక్క కౌన్సిలర్ పూర్తిస్థాయి అఫిడవిట్‌తో వ్యక్తిగతంగా తాను ఛైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెడుతున్నట్లు న్యాయశాఖ నియమించిన నోటరీ వద్ద లేఖను తయారు చేయించి అవిశ్వాస తీర్మానానికి లేఖలు ఇచ్చారు. ఇందులో ఎలాంటి వైఫల్యం ఉన్నా తమదే పూర్తి బాధ్యత అని కూడా పేర్కొన్నట్లు సమాచారం. మరో పక్క ఈనెల 29న జరగాల్సిన మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్‌కు కౌన్సిలర్లు హాజరు కావాలా, వద్దా అనే విషయంపై కూడా చర్చించినట్లు తెలిసింది. ఇప్పటికే ఛైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టిన కౌన్సిలర్లు ఆమె అధ్యక్షతన జరిగే కౌన్సిల్ సమావేశానికి ఎలా హాజరు కావాలని, ఆమెను అధ్యక్ష అని ఎలా పిలవాలని, సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు మెజార్టీ కౌన్సిలర్లు స్పష్టం చేస్తున్నారు. ఛైర్మన్‌గా శాంతను వద్దనుకుని అవిశ్వాస తీర్మానం పెట్టిన రోజే ఆమె కౌన్సిలర్ల విశ్వాసాన్ని కోల్పోయారని, 29న జరిగే కౌన్సిల్ సమావేశానికి హాజరయ్యేది లేదని మెజారిటీ కౌన్సిలర్లు పేర్కొంటున్నారు. అవిశ్వాస తీర్మానం రోజు వైసిపి కౌన్సిలర్లకు విప్ కూడా జారీ చేసేందుకు వైసిపి అధిష్టానం అన్ని చర్యలూ చేపట్టినట్లు తెలిసింది. ఎవరైనా అవిశ్వాస తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేస్తే తమ కౌన్సిలర్ సభ్యత్వాన్ని కోల్పోవాల్సి ఉంటుంది. పూర్తిస్థాయి పకడ్బందీతో ఛైర్మన్‌పై కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానానికి అన్ని సిద్ధం చేశారు. ఈ నేపథ్యంలోనే తమకు కూడా మ్యాజిక్ ఫిగర్ బలం ఉందని, అవిశ్వాసంలో కచ్చితంగా ఛైర్మన్‌గా శాంత నెగ్గుతుందని దీక్ష శిబిరంలో కూర్చున్న నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. దీంతో రహస్యంగా ఏమైనా మంతనాలు జరిగాయా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

అన్నదానం చేస్తున్న నాయకులు

ఉప వాసంలో ఉన్న క్రైస్తవులకు అన్నదానం

- టిడిపి మండల అధ్యక్షుల ఔదార్యం

ప్రజాశక్తి - మంత్రాలయం

గుడ్ ఫ్రైడే సందర్భంగా ఉపవాసం ఉన్న క్రైస్తవులకు అన్నదానం చేసి టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి ఔదార్యం చాటుకున్నారు. శుక్రవారం స్థానిక సిఎస్ఐ చర్చిలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసులు రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వారు మాట్లాడారు. ప్రతి శుక్రవారం ఉపవాసం ఉంటున్న క్రైస్తవులకు అన్నదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, ఆయన సోదరుడు పాలకుర్తి శ్రీనివాసులు రెడ్డి సహకారంతో గతంలో మాదిరిగా ఈ ఏడాది కూడా సుమారు 500 మందికి అన్నదానం చేసినట్లు చెప్పారు. తెలుగు యువత జిల్లా మీడియా కోఆర్డినేటర్ విజయ రామిరెడ్డి, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి వట్టెప్పగారి చిన్న సుంకప్ప, వట్టెప్పగారి నరసింహులు, విద్యా కమిటీ ఛైర్మన్ గణేకంటి గురురాజ రామకృష్ణ, వనికె నాగరాజు, హండే అనుమంతు, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి ఏబు, కయ్యూన్ పాల్గొన్నారు.

మిత్రునికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - హోళగుంద

అనారోగ్యంతో బాధపడుతున్న మిత్రునికి తోటి మిత్రులు రూ.41 వేల ఆర్థిక సహాయాన్ని అందించి 'మేమున్నాం' అంటూ భరోసా కల్పించారు. మండలంలోని మార్లమాడికి గ్రామానికి చెందిన రామాంజి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న విషయం తెలుసుకున్న 2006 బ్యాచ్ మిత్రులు కలిసి

ఇచ్చిన నగదును శుక్రవారం కర్నూలులోని ఆస్పత్రిలో పెద్దహ్యాట మల్లయ్య, చిన్న మల్లయ్య, తిమ్మారెడ్డి, సుధా, ద్యావన్నతో పాటు కలిసి రామాంజి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు. వైద్యులతో మాట్లాడి రామాంజి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. మిత్రుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

రూ.1,74,469 రికవరీకి ఆదేశాలు

- సామాజిక తనిఖీలో రూ.33 వేల జరిమానా

- పీడీ వెంకటరమణయ్య

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయం : ప్రజా వేదికలో మాట్లాడుతున్న అధికారులు

మండలంలోని గ్రామాల్లో ఉపాధి హామీ చట్టం కింద జరిగిన పనుల్లో అవకతవకలకు పాల్పడిన వారి నుంచి రూ.1,74,469 రికవరీకి ఆదేశించి, నిర్లక్ష్యం చేసిన వారందరికీ రూ.33 వేల జరిమానాలు విధించినట్లు డ్వామా పీడీ వెంకటరమణయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపిడిఒ రాధ ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. ఏప్రిల్ 1, 2023 నుంచి మార్చి 31, 2024 వరకు మండలంలోని 20 గ్రామాల్లో జరిగిన ఉపాధి పనులపై బహిరంగ సభ ఏర్పాటు చేసి ఉపాధి సిబ్బంది ద్వారా రికార్డులను తనిఖీ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులు సరిగా లేకపోవడంతో పనుల్లో అవినీతి జరిగిందని భావించి సంబంధిత సిబ్బంది నుంచి రూ.1,74,469ల రికవరీకి ఆదేశాలు జారీ చేశామని, నిర్లక్ష్యం చేసిన వారికి రూ.33 వేల జరిమానాలు చెల్లించాలని ఆదేశించామని పేర్కొన్నారు. అడిషనల్ పీడీ మాధవీలత, ఏపీడీ లోకేశ్వర్, ఏపీవో తిమ్మారెడ్డి, ఈసీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

నందవరం : మండలంలో ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. నందవరం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సామాజిక తనిఖీ నిర్వహించారు. పీడీ వెంకటరమణయ్య, అడిషనల్ పీడీ మాధవిలత, ఏపీడీ అల్లీపీరా పాల్గొన్నారు. మండలంలోని 15 పంచాయతీల్లో ఏప్రిల్ 1, 2023 నుంచి మార్చి 31, 2024 వరకు జరిగిన పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. రూ.4,28,021 రికవరీ, రూ.31 వేల జరిమానాలు విధించినట్లు అధికారులు తెలిపారు. కొన్ని గ్రామాల్లో సామాజిక తనిఖీ అధికారులు తూతూమంత్రంగా తనిఖీలు నిర్వహించినట్లు ప్రజలు విమర్శించారు. ఎంపిడిఒ పుల్లయ్య, ఏపీవో శ్రీనివాసులు, ఈసీ నూర్జహాన్ పాల్గొన్నారు.

నందవరం : సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

పత్తికొండ మార్కెట్ యార్డు చైర్మన్‌గా షేక్ నబీసాబ్

ప్రజాశక్తి - పత్తికొండ

పత్తికొండ మార్కెట్ యార్డు చైర్మన్‌గా క్రిష్ణగిరి మండలం ఆలమ్ కొండ గ్రామానికి చెందిన షేక్ నబిసాబ్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కెఇ కుటుంబానికి వీర విధేయునిగా ఉండడంతో ఆయనను పదవి వరించినట్లు సమాచారం. విద్యార్థి దశలో విద్యారంగ సమస్యలపై అనేక పోరాటాలు చేశారు. విద్యార్థి సంఘం నాయకునిగా పత్తికొండ ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఎన్నికల్లో సెక్రటరీగా ఎన్నికయ్యారు. డోన్ డిగ్రీ కాలేజీలో చదువుతున్న సమయంలో కాలేజీ సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించి సమస్యలు పరిష్కారానికి కృషి చేశారు. వ్యవసాయ నేపథ్యం కుటుంబం కావడంతో రైతు సమస్యలపై అవగాహన ఉంది. శుక్రవారం ఆయన మాట్లాడుతూ... జిల్లా పశ్చిమ ప్రాంతంలో సాగు నీరు లేక రైతులు పడుతున్న అవస్థలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఎమ్మెల్యే శ్యామ్ బాబు సహకారంతో మార్కెట్ యార్డును అభివృద్ధి చేస్తానన్నారు.

రాష్ట్ర బూత్ కమిటీ సంయుక్త సహాయ కార్యదర్శిగా మధుసూదన్ రెడ్డి

ప్రజాశక్తి- దేవనకొండ

వైసిపి రాష్ట్ర బూత్ కమిటీ సంయుక్త సహాయ కార్యదర్శిగా తెర్నేకల్ గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకులు కొత్తకాపు మధుసూదన్ రెడ్డి ఎంపికయ్యారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. రాష్ట్ర కమిటీలో తనకు చోటు ఇవ్వడం పట్ల వైసిపి అధినేత వైఎస్.జగన్మోహన్ రెడ్డికి, ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షికి, వైసిపి జిల్లా అధ్యక్షులు ఎస్వీ.మోహన్ రెడ్డికి, మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మార్కెట్ యార్డు చైర్మన్‌గా మల్లయ్య

- మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

గోనెగండ్ల మండలం పెద్ద మర్రివీడు గ్రామానికి చెందిన కురువ మల్లయ్యకు ఎమ్మిగనూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ పదవి దక్కింది. మల్లయ్య 1969లో కురువ లక్ష్మీదేవి, వెంకటరామప్ప దంపతులకు జన్మించారు. ఆయన 7వ తరగతి వరకు చదువుకున్నారు. వ్యవసాయం చేసుకుంటూ గ్రామస్తులకు ఉల్లి, మిరప పంటల్లో సహాయ, సహకారాలు అందించి మంచి పేరు సంపాదించుకున్నారు. 18 ఏళ్లుగా వ్యవసాయ ఎరువులు, ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్‌లో డీలర్‌గా వ్యాపారం చేశారు. గ్రామంలో సామాన్య టిడిపి కార్యకర్తగా రాజకీయ ప్రవేశం చేసి, 2024లో బీవీ.జయ నాగేశ్వర రెడ్డి పెద్ద మర్రివీడు గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమంలో కురువ మల్లయ్యను టిడిపికి అండగా ఉండాలని గుర్తించారు. 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో గ్రామం నుంచి మంచి మెజార్టీ రావడానికి కురువ మల్లయ్య పాత్ర ప్రాధాన్యతను సంచరించుకుంది. బీవీ.జయనాగేశ్వరరెడ్డికి నమ్మిన బంటుగా ఉంటూ కురువ వనభోజన, భక్త కనకదాసు జయంతిని బీవీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కురువలకు మార్కెట్ యార్డు ఛైర్మన్ పదవి ఇస్తున్నామని బీవీ.జయనాగేశ్వర రెడ్డి ప్రకటించడంతో కురువలు హర్షం వ్యక్తం చేశారు. ఇచ్చిన మాట ప్రకారమే కురువలకు మార్కెట్ యార్డు ఛైర్మన్ పదవి దక్కడంతో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే బీవీకి కృతజ్ఞతలు తెలిపారు.

మల్లయ్యకు సన్మానం : మార్కెట్ యార్డు ఛైర్మన్‌గా ఎంపికైన మల్లయ్యను కురువ సంఘం నాయకులు సన్మానించారు. మల్లయ్యకు ఛైర్మన్ పదవి ఇచ్చినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ఎమ్మెల్యే బీవీకి రుణపడి ఉంటామని నాయకులు తెలిపారు. కర్నూలు పార్లమెంట్ కురువ సాధికార కమిటీ మెంబర్ కెటి.వెంకటేశ్వర్లు, కురువ మద్దిలేటి, ఎర్రకోట జిఎంఆర్ వెంకట్ రాముడు, బనవాసి అయ్యలప్ప, బనవాసి నరసింహులు, మల్కాపురం బీరప్ప, చెన్నాపురం నాగరాజు, మసీదుపురం రాముడు, కురువ నాగరాజు, కె.పుల్లన్న, దైవందిన్నె వంకాయల ఈరన్న, వెంకటేశ్వర్లు, కలగట్ల బుడ్డ ఈరన్న, ఉరుకుంద, ఎర్రకోట నాగేష్, గోపాల్, భాస్కర్, ట్రెజరీ యాదగిరి పాల్గొన్నారు.

మల్లయ్యను సన్మానిస్తున్న నాయకులు

ఉప్పు నీరు తాగలేకపోతున్నాం

ప్రజాశక్తి - ఆదోని

కుళాయి నీళ్లు రావడం లేదని, ఉప్పు నీళ్లు తాగలేక ఇంటి నుంచి తెచ్చుకుంటున్నామని టిడిపి సీనియర్ నాయకులు, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ సూరం భాస్కర్ రెడ్డితో విద్యార్థులు మొరపెట్టుకున్నారు. శుక్రవారం పట్టణ శివారులో ఉన్న సెయింట్ ఆంథోని హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన నిర్వహణను పరిశీలించారు. అన్నం, పప్పు రుచిగా ఉందా అంటూ విద్యార్థులను ఆరా తీశారు. ఉప్పు నీళ్లతో తయారు చేయడం వల్ల రుచిగా లేదని విద్యార్థులు చెప్పారు. మంచినీటి సదుపాయం ఎందుకు లేదని ప్రధానోపాధ్యాయులు కేశవయ్యను భాస్కర్ రెడ్డి ప్రశ్నించారు. కుళాయి కనెక్షన్ చెడిపోయిందని, నీటి సరఫరా నిలిచిపోయిందని ప్రధానోపాధ్యాయులు వివరించారు. అక్కడి నుంచి మున్సిపల్ కమిషనర్ కృష్ణను కలిసి సమస్యను వివరించారు. సెయింట్ ఆంథోని హైస్కూల్ కుళాయి ద్వారా మంచినీటి సదుపాయం కల్పించాలని కోరారు. పరిశీలించి నీటి సదుపాయం కల్పిస్తామని కమిషనర్ హామీఇచ్చారు. రామచంద్ర, సాంబగల్ ఫక్రుద్దీన్, నాయకులు మల్లేశ్వరప్ప, మద్దికెర రామకృష్ణ, సీనియర్ ఎన్‌టిఆర్ అభిమానులు నాగరాజు, నారాయణపురం షాషావలీ, ఇస్వి శ్రీనివాసులు, బిటి.శీన, తిక్కన్న, రమేష్, తాహేర్ పాల్గొన్నారు.

దేశాయ్ ప్రహ్లాద చారి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి - కౌతాళం

వైసిపి మండల అధ్యక్షులు దేశాయ్ ప్రహ్లాద చారి ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. శుక్రవారం స్థానిక జామియా మజీద్, మదీనా మజీద్, నూరానీ మజీద్, అక్స, ఖాదీర్ మజీద్ నుంచి మగ్రిబ్ నమాజ్ అనంతరం ముస్లింలు ఈ ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశాయ్ ప్రహ్లాద చారి మాట్లాడారు. ముస్లింలు కఠోర ఉప వాసం పాటించి, ప్రత్యేక నమాజులు ఆచరిస్తారని తెలిపారు. హిందూ ముస్లింలు సోదరభావంతో మెలిగి అందరూ శాంతి మార్గంలో నడిచి మత సామరస్యాన్ని చాటి చెప్పాలన్నారు. సర్పంచి పాల్ దినకరన్, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, ఉప సర్పంచి తిక్కయ్య, మాజీ సర్పంచి అవతారం, వైసిపి నాయకులు అబ్దుల్ సమద్, రాముడు, హుసేని, ఇద్రుస్, బాష, రామకృష్ణ, శ్రీకాంత్, నరసింహ, శ్రీరామ్ పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న నాయకులు

విలువలు, క్రమశిక్షణతో కూడిన విద్యనందించడమే లక్ష్యం

- కరస్పాండెంట్ గోవిందరెడ్డి

ప్రజాశక్తి - పెద్దకడబూరు

విలువలు, క్రమశిక్షణతో కూడిన విద్యనందించడమే రెయిన్‌బో ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల లక్ష్యమని కరస్పాండెంట్ గోవిందరెడ్డి తెలిపారు. శుక్రవారం పెద్దకడబూరులోని రెయిన్‌బో ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల 8వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ముందుగా వార్షికోత్సవ వేడుకలకు హాజరైన ముఖ్య అతిథులు తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి, టిడిపి మహిళా జిల్లా ఉపాధ్యక్షులు నరవ శశిరేఖ, వైసిపి మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, వైసిపి బూత్ కమిటీ తాలూకా అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచి రామాంజనేయులు, వైసిపి నేత నరవ విరుపాక్షి రెడ్డి, విశ్రాంత విఆర్‌ఒ రామలింగారెడ్డి, రెయిన్‌బో ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల ప్రెసిడెంట్ రంగారెడ్డి, టిడిపి నేతలు మల్లికార్జున, ఇంద్రసేనారెడ్డి, శ్రీబాల వికాస్ యుపి స్కూల్ కరస్పాండెంట్ విశ్వనాథ్ రెడ్డి చేతులమీదుగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఇటీవల రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులు శివ, షోహత్ అలి, అమ్రేష్, కెపి.నరసింహులు, వినోద్‌కు, జిల్లాస్థాయి ఖోఖో పోటీల్లో ప్రతిభ చాటిన బిఆర్.నవీన్‌కు మెడల్స్, ప్రశంసా పత్రాలను అందజేశారు.

ఆటాపాటలతో అలరించిన విద్యార్థులు

విద్యార్థులు ఆటాపాటలతో అలరించారు. నర్సరీ నుంచి 8వ తరగతి వరకు విద్యార్థులు గణపతి పాట, అమ్మవారి భక్తి పాటలతోను, క్లాసికల్ పాటలతో అందరినీ అలరించారు. అలాగే మాస్ సాంగ్స్‌కు చిన్నారులు వేసిన డ్యాన్స్ అందరినీ ఆకట్టుకుంది. 6, 7, 8వ తరగతుల విద్యార్థులు చేసిన పిరమిడ్ విన్యాలు అబ్బుర పరిచాయి. అలాగే నర్సరీ చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. టిడిపి నాయకులు మీ సేవ ఆంజనేయులు, గోనుమాను నరసన్న, కలుగొట్ల లక్ష్మన్న, వైసిపి మండల కోశాధికారి బ్రహ్మయ్య ఆచారి పాల్గొన్నారు.

రైతులకు న్యాయం జరిగేలా చూస్తాం

- తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్

ప్రజాశక్తి - చిప్పగిరి

రైతులతో మాట్లాడుతున్న తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్

రైల్వే డబుల్ లైన్ వేసేందుకు రైల్వే శాఖాధికారులు రైతుల పొలాలను తీసుకుంటున్న నేపథ్యంలో నంచర్ల, దౌల్తాపురం, చిప్పగిరి గ్రామాల రైతులకు సంబంధించిన పొలాలు ఉండడంతో రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్ తెలిపారు. శుక్రవారం దౌల్తాపురం, చిప్పగిరి, నంచర్ల గ్రామాలకు చెందిన రైతులు తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ అహ్మద్, రెవెన్యూ సిబ్బందితో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడారు. రైల్వే శాఖ అధికారులతో మాట్లాడిన తర్వాతనే పూర్తి న్యాయం చేస్తామన్నారు. రైల్వే డబుల్ లైన్ వేసేందుకు ఏయే గ్రామాల రైతులకు సంబంధించిన పొలాలను ఇస్తున్నారో ఆ వివరాలన్నీ మళ్లీ చేసుకొని రైల్వే శాఖ అధికారులకు పూర్తి సమాచారం ఇస్తామని తెలిపారు. వారి వివరాలను తెలుసుకొని పొలాల ధర ఏ విధంగా ఉందో తెలుసుకొని రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని చెప్పారు. మండల సర్వేయర్ నారాయణ, ఆర్ఐ సునీత, సీనియర్ అసిస్టెంట్ రామాంజనేయులు, విఆర్ఒలు గోవిందప్ప, పెద్దన్న పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

- సర్పంచి భాస్కర్

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని కూకటికొండ గ్రామంలో తాగునీటి సమస్య తీర్చడానికి సర్పంచి భాస్కర్ శుక్రవారం చర్యలు చేపట్టారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు సహకారంతో తాగునీరు బోరు తవ్వకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు, అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

రైతులను మోసం చేసిన 'కూటమి'

- వైసిపి రాష్ట్ర రైతు విభాగం అధికార ప్రతినిధిగా గడ్డం లక్ష్మీనారాయణ రెడ్డి

ప్రజాశక్తి - నందవరం

కూటమి ప్రభుత్వం రైతులను మోసం చేసిందని వైసిపి రాష్ట్ర రైతు విభాగం అధికార ప్రతినిధి గడ్డం లక్ష్మినారాయణ రెడ్డి మండిపడ్డారు. ఎన్నికల సమయంలో రైతులకు ఎన్నో హామీలిచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను నెరవేర్చకుండా రైతులను మోసం చేసిందని విమర్శించారు. హాలహర్వి గ్రామానికి చెందిన కె.గడ్డం లక్ష్మినారాయణ రెడ్డిని వైసిపి రాష్ట్ర రైతు విభాగం అధికార ప్రతినిధిగా నియమించారు. శుక్రవారం వైసిపి మండల కన్వీనర్ శివారెడ్డి గౌడ్, నియోజకవర్గ యూత్ అధ్యక్షులు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ డి.నజీర్ అహ్మద్, ప్రచార విభాగం అధ్యక్షులు చాంద్ బాష, ఎస్సీ విభాగం అధ్యక్షులు శాంతిరాజు, నందవరం మండల ప్రధాన కార్యదర్శి బోయ బజారి, హాలహర్వి గ్రామ అధ్యక్షులు హజరత్ బిలాల్, కురువ రంగన్న, జయరాజు ఆయనకు శాలువా, పూలమాలలు వేసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గడ్డం లక్ష్మినారాయణ రెడ్డి మాట్లాడారు. తనను అభిమానించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

లక్ష్మినారాయణ రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు